సమస్యలను గుర్తించి పరిష్కరించాలి

చాపాడు : పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జగనన్న సురక్ష పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దారు సుభానీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఏఓ రామాంజనేయులున్నారు.

ఆణిముత్యాలను గుర్తించింది జగనన్నే

ప్రొద్దుటూరు : ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఆణిముత్యాలను గుర్తించి, ప్రోత్సహిస్తోంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. రామేశ్వరం ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం పదో తరగతిలో టాప్ మార్కులు సాధించిన ఎస్.హరిణి (590), పి.సుచరిత (575), జి.కావ్యశ్రీ (571)లకు ప్రభుత్వం తరఫున వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 నగదు, ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే ఎమ్మెల్యే రాచమల్లు తన మేనత్త పాతకోట పార్వతమ్మ స్మారకార్థం వీరికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు అందించారు.

మున్సిపాలిటీలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు

గత నాలుగేళ్లలో అవసరం ఉన్న చోటల్లా రోడ్లు, కాలువలను నిర్మించామని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. మున్సిపాలిటీలో రూ.100 కోట్లతో ఇప్పటికే అభివృద్ధి పనులు చేశామన్నారు. 9వ వార్డు పరిధిలో రూ.13 లక్షలతో నిర్మించనున్న రోడ్డు, డ్రైనేజి కాలువల నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజుతో కలసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.



విద్యార్థినికి నగదు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అట్లూరు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బద్వేలు ఎమ్మెల్యే సుధా పేర్కొన్నారు. కొండూరు సచివాలయ పరిధిలోని కొత్తకోటపాడు, ఎస్సీ, ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, గోపినాథపురం, కొండూరు, మహమ్మద్‌బాయిపల్లి గ్రామాలలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దున్నూతల రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. డీఎల్‌డీఏ చైర్మన్ రొండా మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

క్షుద్రపూజల పేరుతో మహిళలను ట్రాప్ చేస్తున్న గ్యాంగ్

ప్రొద్దుటూరు క్రైం : బాబా క్షుద్రపూజలు చేస్తే ఆర్థిక సమస్యలతో పాటు పెళ్లి కాని ఆడపిల్లలకు త్వరగా పెళ్లిళ్లు అవుతాయని ఓ గ్యాంగ్ మహిళలను మోసగిస్తోంది. అయితే తిరుపతికి చెందిన ఒక మహిళ ఈ ముఠా సభ్యుల చేతిలో మోసపోయింది. ఆమె ఫిర్యాదుతో బాబా అండ్ కో చేస్తున్న మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆదేశాల మేరకు సీఐ యుగంధర్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్‌లు సిబ్బందితో కలిసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అమృతానగర్‌లో దాడులు నిర్వహించారు. దాడిలో అనంతపురం జిల్లాకు చెందిన నాగరాజు, రాముడు, వెంకటేష్, కర్నూలు జిల్లాకు చెందిన కంబగిరి రాముడు, కాంతమ్మ, నంద్యాల జిల్లాకు చెందిన రవికుమార్, తిరుపతికి చెందిన ప్రియలను అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపిస్తునట్లు ఏఎస్పీ తెలిపారు. విచారణలో భాగంగా నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు బాబా, మరి కొందరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. క్షుద్ర పూజలకు అంగీకరించిన మహిళలను లొంగదీసుకొని వ్యభిచార కూపంలోకి దింపే ప్రయత్నం జరుగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

MYDUKUR MUNICIPALITY

'e' Procurement Tender Notice No. 229 to 233/2022-23/CMDF-2022-23 (Short Tender-1st Call) and 234/2022-2/MPLDAS-2022-23/E1, Short Tender-(2nd Call)

Estimate Cost 5 No's works Rs. 30,30,000-00 (CMDF)
Estimate Cost 1 No work Rs. 5,00,000-00 (MPLADS)

Bid Document Downloading Start Time	: 20.06.2023 @ 10.00 AM.
Bid document downloading End date	: 27.06.2023 @ 4.00 PM.
Last date / Time of receipt of Tender	: 27.06.2023 @ 5.00 PM.

Contact: Commissioner, Mydukur Municipality - 8008559302
Further details can be seen @ 'e' Procurement market place @ www.'e'procurement.gov.in Assistant Engineer, Contact No. 9494161444

Commissioner, Mydukur Municipality

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

రాజుపాళెం : రాష్ట్రంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయ్యాక ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందని ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండల పరిధి వెలవలిలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి ఫలితాల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదును అందజేశారు.

విద్యతోనే అభివృద్ధి

ప్రొద్దుటూరు : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి నాగేంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం జగనన్న ఆణిముత్యాల నగదు బహుమతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. సర్పంచ్ తన వేతనం నుంచి అత్త సరోజమ్మ పేరుపై రూ.6 వేలు విద్యార్థులకు అందించారు.

మున్సిపల్ హైస్కూల్‌లో..

స్థానిక 17వ వార్డు నడింపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాల కింద జి.అభినందనకు రూ.3 వేలు, ఎస్.మహమ్మద్ సోహేల్‌కు రూ.2 వేలు, ఎల్.దీపిక, టి.మహమ్మద్‌కు రూ.1000 నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు.



త్వరలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి నూతన భవనాలు

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి త్వరలోనే నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మైదుకూరులో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదివిన విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానం పొందుతూ 9.91, 9.60 జీపీఏ సాధించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ డిగ్రీకాలేజీలో చేరి విద్యార్థులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ బీజెడ్సీ, బీఏ, బీకాం కంప్యూటర్స్ కోర్సులు మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.





రఘురాముడు.. నిస్వార్థసేవకుడు

చాపాడు : మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి రాజకీయాలలో గత మూడు తరాలుగా ప్రతిపక్ష, అధికార పక్ష ఎమ్మెల్యేగా సేవలు అందిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకూ రైతన్నలకు సాగునీరు అందించేందుకు అలుపెరగని పోరాటం చేస్తూ.. సీఎం వైఎస్ జగన్ రూపంలో రాజోలి ఆనకట్ట నిర్మాణానికి నాంది పలుకుతూ శాశ్వత పరిష్కార మార్గం చూపారు. 40 ఏళ్లకు పైగా రాజకీయ అనుభవం కలిగిన రఘురామిరెడ్డి జన్మదినం సందర్భంగా.. మూడు తరాల ప్రజావారధి పుస్తకం విడుదల అవుతున్న నేపథ్యంలో... ఆయన చరిత్ర ఇలా.. 1967లో తన పెదనాన్న శెట్టిపల్లె నాగిరెడ్డి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే కాగా.. 1972లో ఏకగ్రీవంగా గెలుపొందారు. అప్పట్లో ఏకగ్రీవంగా ఎన్నికవటంతో పెద్ద నాగిరెడ్డి తమ్ముడు చిన్ననాగిరెడ్డి కుమారుడైన రఘురామిరెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారు. అప్పటి నుంచి మొదలైన రఘురామిరెడ్డి రాజకీయ ప్రస్థానం మొదటగా 1985లో టీడీపీ తరఫున పోటీ చేసిన మొదటి సారే ప్రత్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అయిన డీఎల్ రవీంద్రారెడ్డిపై రఘురామిరెడ్డి 3695 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పటి సీఎం ఎన్టీ రామారావు హయాంలో పని చేశారు. 1999లో చంద్రబాబు హయాంలో డీఎల్‌పై 5,520 ఓట్లతో రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004–09 వరకూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రతిపక్షంలో పని చేశారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2011లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి వైఎస్ జగన్ కడప ఎంపీగా 5,45,672 ఓట్ల మెజార్టీలో రావడంలో మైదుకూరు నుంచి కృషి చేశారు. 2014లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీ నుంచి 11,522, 2019లో 29,674 ఓట్లతో టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌పై గెలుపొందారు. నాటి తన పెదనాన్న తరం నుంచి ఎన్టీ రామారావు, చంద్రబాబు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మూడు తరాల ప్రజావారధిగా ప్రజా సేవ చేస్తున్నారు. నియోజకవర్గ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రతి ఏటా మైదుకూరులో ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు వంటి ఉద్యమాలు చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వైఎస్ మరణానంతరం నిలిచిపోయిన రాజోలి రిజర్వాయర్‌ను నిర్మించేందుకు శాశ్వత పరిష్కారం కోసం సీఎం వైఎస్ జగన్‌తో శంకుస్థాపన చేయించారు. మైదుకూరులో 100 పడకల సామాజిక ఆసుపత్రి, బద్వేలు రోడ్డు సువిశాలమైన విస్తీర్ణంలో సంత, రూ.30కోట్లతో డిగ్రీ కాలేజీ, రూ.70కోట్లతో మైదుకూరు పట్టణంలో సుందరీకరణ పనులు, మైదుకూరులో అగ్రి ల్యాబ్, పాలిటెక్నిక్ కాలేజీ మంజూరు, నూతన రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయం, మైదుకూరు కోర్టు భవనాల నిర్మాణం, చెరువుల అభివృద్ధి, బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల నీటి నిల్వ చేయించటం ఇలా ప్రజాజీవనంలో అవసరాలైన అనేక మంచి పనులు చేసి నియోజకవర్గ ప్రజా సేవకుడుగా గుర్తింపు తెచ్చుకున్నారు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి.



వీరయ్య స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చాపాడు : మండలంలోని బద్రిపల్లెలో వెలసిన అవధూత దిగంబర వీరయ్య స్వామి 46వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వీరయ్య స్వామిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేయించారు. ఆయనతో పాటు ఎంపీపీ లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

స్పందనలో తహసీల్దారుపై ఫిర్యాదు

చాపాడు: మండలంలోని వి.రాజుపాళెం గ్రామానికి చెందిన సి.గుర్రప్ప తనభూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా తహసీల్దారు సుభానీ ఇబ్బందులకు గురి చేస్తున్నారని సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పొలంలో సర్వే నెంబరు 820లో 3.10 ఎకరాలలో తనకు 1.30 ఎకరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా తహసీల్దారు ప్రతి రోజూ తిప్పుకుంటున్నాడని వాపోయాడు. తహసీల్దారు సుభానీని వివరణ కోరగా.. గుర్రప్ప అర్జీ మేరకు ఇప్పటికే వారి అన్నదమ్ములకు రెండు సార్లు నోటీసులు జారీ చేశామన్నారు.

















మార్కెట్ వ్యాపారుల నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : ది ప్రొద్దుటూరు వైఎస్సార్ మున్సిపల్ మార్కెట్ వ్యాపారస్తుల అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వి.వలిబాషా తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. అసోసియేషన్ అధ్యక్షునిగా వలిబాషా, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఖాసీం, గౌరవ అధ్యక్షునిగా జాఫర్‌హుసేన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దాదాపీర్, ఉపాధ్యక్షులుగా సుభహాన్, వేణుగోపాల్‌రెడ్డి, ఖాజామొదిన్, షబ్బీర్, కార్యదర్శులుగా అల్లాబకాష్, ఖాజావలి, కోశాధికారి మహేంద్రలను ఎన్నుకున్నారు.

హెడ్ మాస్టర్‌కు ఎంఈఓగా పదోన్నతి

పోరుమామిళ్ల : టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ పి.రత్నస్వామిని పదోన్నతిపై పోరుమామిళ్ల రెండవ మండల విద్యాశాఖ అధికారిగా నియమించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఉత్తర్వులు అందుకున్నారు.

